క్లుప్తంగా

కార్తీకమాసం పూజలకు రాట ముహూర్తం



కార్తీకమాసం పూజలకు రాటముహూర్తం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర కావడం, ఈనెల 22 నుంచి ప్రారంభంకానున్న కార్తీకమాసం పూజలకు ఆలయ ప్రాంగణం వెలుపల ఈశాన్యంలో ఆలయ చైర్మన్ మీసాల రామచంద్రరావు దంపతులు రాట ముహూర్తం చేశారు. విద్యుద్దీపాలంకరణ, చలువ పందిర్లు, క్యూలైన్ల ఏర్పాట్లు ప్రారంభించనున్నామని ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస రావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు పినిశెట్టి శ్రీనివాస్, బాసిన సత్యనారాయణ, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ప్రధానార్చకులు కిష్టప్ప, అనిల్, వీర బాబు, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పాలకోడేరు: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పలువురు వక్తలు తెలిపారు. పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామంలో భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆంధ్రా విద్యార్థి సంఘం, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మాదక ద్రవ్యాల నివారణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించాలన్నారు. జయప్రకాష్ నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, అల్లు వంశీ కృష్ణా, ఏవీఎస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వంశీ కృష్ణా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ బి ఎస్ ఆర్ మనోహర్, ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ కె రాగిణి, ఎంబీఏ హెచ్‌వోడీ డీసీహెచ్ రోహిణి పాల్గొన్నారు.

ఆక్రమణలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

పాలకోడేరు: మండలంలోని వేంద్ర గ్రామంలో కాలువను అనుకుని ఉన్న భూములు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని అదే గ్రామానికి చెందిన కడలి దుర్గారావు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వేంద్ర శివారు వైన్ షాప్ దగ్గర ఉన్న పిల్లకాలువ ఆర్ఎస్ నెంబర్ 145, 162, 163, 164 గల భూములు భూపతి రాజు రాంబాబు కాలువ భూములను ఆక్రమణకు సంబంధించి గతంలో పీజీఆర్ఎస్‌లో మూడుసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదని, గ్రామ శివారులో ఉన్న ఓఎన్‌జీసీ గ్రౌండ్ దగ్గర ఆర్ఎస్ నెంబర్ 161/2 బి లో 2-93 సెంట్ల భూమిని భోగిరెడ్డి శ్రీనివాసరావు, భూపతిరాజు సత్యనారాయణరాజు ఆక్రమించి, లేఅవుట్లు చేసి సెంటు రూ.3 లక్షల చొప్పున అమ్ముకున్నారని దీనికి సంబంధించి తహసీల్దార్‌కు ఏ విధమైన కన్వర్స్ ఫీజు చెల్లించలేదని, అక్రమ లేఅవుట్లో ఇళ్లు నిర్మించుకున్న పంచాయతీ అధికారులు ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ సంబంధిత ఆక్రమణ భూములపై విచారణ చేపట్టి క్రింది స్థాయిలో అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

17న శ్రీధన్వంతరి జయంతోత్సవాలు

భీమవరం: నాయి బ్రాహ్మణ జెఏసి ఆధ్వర్యంలో ఈనెల 17వ తేది నుంచి భీమవరంలో శ్రీధన్వంతరి జయంతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయి బ్రాహ్మణ జేఏసి ప్రెసిడెంట్ పట్నాల గణపతి, భీమవరం అధ్యక్షుడు కోడూరి రామకృష్ణ చెప్పారు. సోమవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ధన్వంతరి జయంతోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. ప్రప్రథమ ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరేనన్నారు. ఆయుర్వేద వైద్యరంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వర రావు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ధన్వంతరి జయంతి సందర్భంగా ఈనెల 17వ తేదీన ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఉచిత హోమియో, ఆయుర్వేదం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల సమ్మె నోటీసు

తణుకు అర్బన్: మునిసిపల్ కార్మికులు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు వచ్చే నెల 3 నుంచి సమ్మెకు సమాయత్తమవుతున్నట్టు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, తణుకు మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బొద్దాని నాగరాజు పేర్కొన్నారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ ఆధ్వర్యంలో సోమవారం తణుకు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. 12వ పీఆర్సీ ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని, మునిసిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పెరుగుతున్న విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల నిష్పత్తి పెంచాలని, డైలీ వేజ్ కార్మికులను అవుట్ సోర్సింగ్‌లోకి తీసుకోవాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

రాష్ట్రంలో ఏరులై పారుతున్న మద్యం

- వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గోపి
- పాలకొల్లు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన



ఎక్సైజ్ ఎస్సైకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాలకొల్లు సెంట్రల్: కూటమి ప్రభుత్వంలో నారా వారి నకిలీ మద్యం రాష్ట్రంలో ఏరులై పారుతోందని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యంపై సోమవారం గోపి నాయకత్వంలో మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎస్సైకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం ప్రజల ప్రాణాలను హరిస్తుంటే ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు యాచకుల మరణాలను నకిలీ ఖాతాలో వేస్తున్నారంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు ఏసీ గదుల్లో కూర్చుని ప్రెస్‌మీట్‌లు పెడితే క్షేత్ర స్థాయిలో జరిగే ఘటనలు చంద్రబాబుకు అలుసుగానే కనిపిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరన్నర అయినా ఇంకా జగనన్న ఫోబియో చంద్రబాబుకు పోలేనట్టుందని ఎద్దేవా చేశారు. అంటే జగనన్న పరిపాలన చంద్రబాబుపై ఎంత ప్రభావం చూపిస్తుందో అర్థమవుతుందని వివరించారు. ప్రతిపక్షంలో ఉన్నా అధికార పక్షంలో ఉన్నా మంచి చేస్తే ప్రజలు చిరస్థాయిగా గుండెల్లో పెట్టుకుంటారనడానికి వైఎస్సార్, జగనన్న కుటుంబమే నిదర్శనమని అన్నారు. అందుకే అధికారంలో ఉన్నా చంద్రబాబు జగనన్నను మర్చిపోలేక ప్రతి ప్రెస్‌మీట్‌లో గుర్తుచేసుకుంటున్నారని వివరించారు. ప్రభుత్వం ఎందులో విఫలమైనా జగనన్నను తలుచుకోనిదే రోజు వెళ్లడంలేదన్నారు. బ్రాండెడ్ మద్యం తక్కువ ధరకే విక్రయిస్తామని చంద్రబాబు చెప్పితే నిజమే అని నమ్మిన మద్యం ప్రియులు నకిలీ మద్యం తయారు చేసి, తక్కువ ధరలకు విక్రయించడాన్ని చూసి అవాక్కవుతున్నారని చెప్పారు. నమ్మించి మోసం చేయడం చంద్రన్నకు అలవాటేనని మరోసారి రుజువైందని అన్నారు.

నోరు విప్పని పవన్

'ప్రశ్నిస్తాను.. ఎవరినైనా సరే నిలదీస్తాను' అని బీరాలు పలికిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నకిలీ మద్యంపై నోరు మెదపడంలేదు ఎందుకని గుడాల గోపి ప్రశ్నించారు. యువత పాతికేళ్ల భవిత కోరుతున్నారని ట్వీట్ చేస్తున్నారే తప్ప ప్రాణాలు హరించుకుపోతున్న నకిలీ మద్యంపై స్పందించడంలేదని ఆరోపించారు. సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిలిచిన మోకాలులోతు నీటిలోనే మహిళలు తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల తాతాజీ, కోరాడ శ్రీనివాస్, కర్రా జయసరిత, మద్దా చంద్రకళ, బండి రమేష్, ఉండ్రాజవరపు రవి, మోర్త గిరీష్, ఖండవల్లి వాసు, జోగాడ ఉమామహేశ్వర రావు, వీరా మల్లికార్జునుడు, దేవ రాజేష్, చాంద్‌బీబీ, రాజేశ్వరి, నాగలక్ష్మి, జ్యోతి, లక్ష్మీ విమల, జోగి వెంకటేశ్వరరావు, బాబి, రామానుజుల చిన్నమదు, రామానుజుల పెద్దమదు, రమేష్, పండు, సతీష్, కొరగింజల హనుమంతురావు, కెల్లా పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యానికి సూత్రధారి చంద్రబాబే



తూర్పుపాలెంలో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ ముప్పాల

పెనుగొండ: రాష్ట్రంలో నకిలీ మద్యానికి సూత్రధారి ముఖ్యమంత్రి చంద్రబాబేనని ఆచంట మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ముప్పాల వెంకటేశ్వరరావు ఆరోపించారు. సోమవారం తూర్పుపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలోనూ వీధివీధికి బెల్ట్ షాపులు ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకులతో కల్తీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసి నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని చెప్పారు. గుడి, బడితో సంబంధం లేకుండా బెల్టు షాపులు ఏర్పాటు చేసి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు రూ.5,370 కోట్లు లిక్కర్ స్కాం చేశారని, ఇందులో 30 శాతం కరకట్టకు ప్యాకేజీగా వెళ్తుందని ఆరోపించారు. చంద్రబాబు సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చెప్పారని, అయితే సృష్టించిన సంపద పెదబాబు, చినబాబుకే సరిపోతుందని అన్నారు. ఆచంట నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ ఎమర్జెన్సీ మెడికల్ షాపుల మాదిరిగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారని వివరించారు. దీనిపై పార్టీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు పోరాటం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కర్రి వేణుబాబు, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావవు, పిల్లి రుద్రప్రసాద్, కీర్తి తాతాజీ, గుబ్బల వీరా బ్రహ్మం, కొంబొత్తుల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నరసాపురం: కార్తీకమాసంను పురస్కరించుకుని పంచారామ క్షేత్రాలకు నరసాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుతుతున్నట్టు డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. సోమవారం ఒక్క రోజే పంచారామ క్షేత్రాలను దర్శించుకునే విధంగా ఈ బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 26, నవంబర్ 2, 9, 16 తేదీల్లో రాత్రి 7 గంటలకు బస్సు నరసాపురంలో బయలుదేరి సోమవారం అమరావతి, ద్రాక్షారామం, సామర్లకోట, భీమవరం, పాలకొల్లు ఈ క్షేత్రాలను దర్శించి, తిరిగి అదేరోజు రాత్రికి డిపోకు చేరుతుందని తెలిపారు. పల్లె వెలుగు బస్సుకు రూ.750, ఆల్ట్రా పల్లె వెలుగుకు రూ.800, ఎక్స్‌ప్రెస్‌కు రూ.900లు చార్జీలు వసూలు చేస్తారని వివరించారు.

శబరిమల, శ్రీశైలంకు బస్సులు

30 మంది భక్తులు ఉంటే శబరిమల, శ్రీశైలం క్షేత్రాలకు బస్సులు ఏర్పాటు చేస్తామని డీఎం సుబ్బన్నరెడ్డి చెప్పారు. వివరాలకు డిపో మేనేజర్ ఫోన్ నంబర్ 99592 25486లో సంప్రదించాలని కోరారు.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

పాలకొల్లు సెంట్రల్: బీసీ కులాలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని, వాటిని ఏబీసీడీలుగా విభజించాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సాయంత్రం స్థానిక లయన్స్ కమయూనిటీ హాలులో నిర్వహించిన హలో బీసీ, చలో పాలకొల్లు రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సంఘం రాష్ట అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవానీ, టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కర్నేన గౌరు నాయుడు మాట్లాడుతూ బీసీల హక్కుల అమలు కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కోరుకొండ సుబ్బారావు, వింజరపు శంకరం, రాజా, పొన్నమండ ముత్యాలరావు, వందరపు శ్రీనివాసరావు, కట్ట సాయి కిరణ్, గబ్బిడి నరసింహరాజు, అంగర దేవకుమార్, నమ్మి లక్ష్మి, మేకా జయ, గుబ్బల యశోదశెట్టి, పాలవలస నాగ విజయలక్ష్మి, నాగుల కొండ మంగదేవి, వేంద్రపు నాగలక్ష్మి, యండమూరి మేరీ పాల్గొన్నారు.

ఏనుగు సంబరం

వీరవాసరం: వీరవాసరంలో ఏనుగు సంబరం సోమవారం ఘనంగా ప్రారంభించారు. మేళ, తాళాలతో, బాణాసంచా కాల్పుల మధ్య బేతాళునిని ఏనుగుపై ఉంచి గ్రామోత్సవాన్ని కోబ్రా డాన్సులు, తీన్మార్ నృత్యాలు జానపద కళారూపాల ప్రదర్శనలు, కోయ నృత్యాలు, వివిధ రకాల బ్యాండ్ మేళాల నడుమ నిర్వహించారు. భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ నేత చినమిల్లి వెంకటరాయుడు, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, సర్పంచ్ చికిలే మంగతాయారు పాల్గొన్నారు.

నేడు ఆచంటలో వైఎస్సార్‌సీపీ నిరసన

పెనుమంట్ర: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి చెరకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఆచంట తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నకిలీ మద్యం విక్రయాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయనున్నట్టు పార్టీ పెనుమంట్ర మండల అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు తెలిపారు. పార్టీ నర్సాపురం పార్లమెంట్ కమిటీ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, ప్రముఖులు పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులంతా హాజరు కావాలని ఆయన కోరారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయం నుంచి ప్రదర్శనగా ఆచంట వెళ్లనున్నట్టు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ 10వ వార్డు కమిటీ నియామకం



నూతన కమిటీని అభినందిస్తున్న తాతాజీ తదితరులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో 10వ వార్డు వైఎస్సార్‌సీపీ కమిటీని సోమవారం నియమించారు. వార్డు ఇన్‌చార్జిగా సాల్మన్‌రాజు, అధ్యక్షుడిగా నక్కా సహదేవుడు, ఉపాధ్యక్షులుగా కారుమంచి కిరణ్, డొల్లా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా రాపాక శివకుమార్, కార్యదర్శిగా గొల్లామందుల అబ్రహం, బందెల బాబూరావు, ట్రెజరర్‌గా దిద్దే చిట్టిబాబు, కార్యవర్గ సభ్యులుగా బుగ్గే రవి, చదలవాడ భూషణం, నక్కా రమేష్, చదలవాడ ప్రభాకర్, వడ్డి శేఖర్, దిగుమర్తి చిన్నా, మేడిది రవి, మామూడూరి నాగమణి, రొక్కాల మేరీ తదితరులను ఎంపికయ్యారు. కమిటీ సభ్యులను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అభినందించారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టే విధంగా జగనన్న సైన్యం నడుం బిగించాలని ఆయన సూచించారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోరాడ శ్రీనివాస్, బండి రమేష్, మద్దా చంద్రకళ, ఖండవల్లి వాసు, మోర్త గిరీష్, జోగాడ ఉమామహేశ్వరరావు, రామాంజుల మదు, పాలపర్తి కృపానాథ్, కోట రత్నరాజు, రేలంగి శ్రీను, కెల్లా పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం



మేడపాడులో బాలింతలతో మాట్లాడుతున్న రాజు

యలమంచిలి: మాతా శిశు మరణాల రేటు తగ్గించటానికి కేంద్రం ప్రభుత్వం కిల్కారి కాల్ విధానం ప్రవేశ పెట్టిందని, ఈ కిల్కారి సేవలను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలని కిల్కారి రీజినల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు అన్నారు. ఆయన సోమవారం మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలను కలిసి కిల్కారి కాల్స్ ఏ విధంగా ఉపయోగపడుతున్నాయివో అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ నాలుగో నెల నుంచి పుట్టిన బిడ్డకు సంవత్సరం వరకు కిల్కారి కాల్స్ వస్తాయని, ఈ కాల్‌లో ఏ వారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తారని తెలిపారు. కిల్కారి కాల్ వచ్చే ఫోన్ నంబర్ 911600 103660ను గర్భిణులు, బాలింతలు తమ మొబైల్‌లో సేవ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి మురుకుర్తి శివకుమార్, పబ్లిక్ హెల్త్ నర్స్ గంటా రత్నకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ జేవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న టీడీపీ నేతలు

పెనుమంట్ర సర్పంచ్, ఉప సర్పంచ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ప్రియాంక, ఉపసర్పంచ్ శ్రీనివాసరాజు



హాజరైన గ్రామస్తులు

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధికి ఆటంకాలు కల్పించేది కొందరు స్థానిక టీడీపీ నాయకులేనని గ్రామ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, పలువురు బోర్డు సభ్యులు ఆరోపించారు. వారు సోమవారం ప్రజల సమక్షంలో విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ నేతలైన పోలమూరు, వెలగల వారి పాలెం మాజీ సర్పంచులు చింతపల్లి రామకృష్ణ, వెలగల బుల్లి రామిరెడ్డిలతోపాటు టీడీపీ గ్రామ అధ్యక్షులు గంటా వాసు, మూడో వార్డు సభ్యుడు సనమండ సుధాకర్‌లు చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ టీడీపీ స్థానిక నాయకులు చెప్పే మాటలు విని తమపై గ్రామ సభల్లో నిరాధారమైన ఉద్దేశపూర్వకమైన తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ ప్రజల ముందు కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని, ఆ విషయాన్ని వేదికపైనే ఖండించామని, మరుసటి రోజు పత్రిక ముఖంగా వివరణ ఇచ్చామని తెలిపారు. గ్రామానికి సంబంధం లేని ఇద్దరు మాజీ సర్పంచ్‌లతో పాటు టీడీపీ గ్రామ అధ్యక్షుడు, మూడో వార్డు మెంబర్ సుధాకర్ ప్రెస్‌మీట్‌లో ఉప సర్పంచ్ పై చేసిన నిరాధారమైన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను నిరూపిస్తే తన ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని ఉప సర్పంచ్ శ్రీనివాసరాజు సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క శాశ్వత పని కూడా నిధులు మంజూరు చేయలేకపోయారని, గ్రామంలో ఎస్సీ బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులను తాము శ్లాబ్ లెవెల్ వరకు పూర్తి చేయగా, వాటిని నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో అత్యవసర పనులకు తీర్మానం చేస్తే అధికారులను బెదిరించి వాటిని చేయనివ్వకుండా నిలిపివేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, వార్డు సభ్యులు తేతలి లక్ష్మీనారాయణ రెడ్డి, కొవ్వూరి నాగరాజు మోహన్ రెడ్డి, శలమల దుర్గ, కొప్పిశెట్టి వెంకటలక్ష్మీతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులను వినియోగించాలి



ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): స్వదేశీ వస్తువులను ప్రజలు విరివిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వాణిజ్య పనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, ఎస్‌హెచ్‌జీ మహిళల ఉత్పత్తుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంయుక్తంగా తిలకించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కె.పి శైలజ, జిల్లా హ్యాండ్లూమ్స్ అధికారి ఏ.అప్పారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మనోజ్ వుడ్ వర్క్, కె.ఇల్లిందలపర్రు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు బస్టాండ్ జలమయం



పాలకొల్లు సెంట్రల్: చెరువును తలపిస్తున్న శ్రీనివాస డీలక్స్ రోడ్డు



పాలకొల్లు సెంట్రల్: మునిగిపోయిన ఆటో స్టాండ్

పాలకొల్లు సెంట్రల్: సోమవారం వేకువజాము నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు కురిసిన వర్షానికి పాలకొల్లు పట్టణం జలమయమైంది. బస్టాండ్ సెంటర్ రోడ్డుపై వర్షం, డ్రెయినేజీల్లో మురుగునీరు కలిసి ప్రవహించడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆటో స్టాండ్ నీట మునిగింది. బస్టాండ్‌లో మోకాలులోతు నీరు చేరడంతో ప్రయాణికు ఇబ్బందులు పడ్డారు. బస్సులు ఎక్కే సమయంట నీటిలో జారి పడిపోయారు. లయన్స్ నగర్ రోడ్డుపై నీరు చేరింది. హౌసింగ్ బోర్డు కాలనీ, బ్రాడీపేట, బంగారువారి చెరువుగట్టు, సలాదివారి తోట ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. శ్రీనివాసా డీలక్స్ ఎదురుగా రోడ్డులో ఉన్న ఆటోస్టాండ్, సైకిల్ స్టాండ్, సులభ్ కాంప్లెక్స్‌లు మునిగిపోయాయి.

ముంపులో పెనుమంచిలి తూర్పు గరువు

పెనుగొండ: సోమవారం కురిసిన భారీ వర్షానికి ఆచంట మండలం పెనుమంచిలి తూర్పు గరువు ఎస్సీ కాలనీ నీట మునిగింది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ.5 లక్షలతో త్వరలోనే కాలనీలో పనులు ప్రారంభిస్తామని కూటమి నేతలు ఘంటా పథంగా చెప్పడం తప్ప కార్యాచరణ చేపట్టలేదని కాలనీ వాసులు ఆరోపించారు. కాలనీలో కచ్చా డ్రెయిన్లలో మురుగు వర్షపునీటితో కలిసి రోడ్లపై ప్రవహించిందని, దుర్వాసన వెదజల్లి తీవ్ర అసౌకర్యానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీటిలో రాకపోకల కారణంగా వ్యాధుల భారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ సమస్యలకు పరిష్కారం చూపాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.



పాలకొల్లు సెంట్రల్: కాలుతో వర్షం నీటిని గెంటుతున్న వ్యాపారి



పెనుగొండ : ఎస్సీ కాలనీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

టీవీ టెక్నీషియన్ల నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కమిటీని అభినందిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: టీవీ టెక్నీషియన్ల సంక్షేమానికి కుటుంబ సంక్షేమ పథకం ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నామని రాష్ట్ర టీవీ టెక్నీషియన్ సంఘ అధ్యక్షుడు మధుసూధన్ రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా మరణించిన టెక్నీషియన్ కుటుంబానికి రూ.55 వేలు సాయం అందిస్తున్నట్టు ఎప్పారు. సోమవారం స్థానిక వీవర్స్ కాలనీ సమత మహిళా మండలి విజ్ఞాన భవనంలో కుటుంబ సంక్షేమ పథకం బోర్డు వైస్ చైర్మన్ మానెం బసవరాజు అధ్యక్షతన జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షునిగా బండి దుర్గాప్రసాద్ (తాడేపల్లిగూడెం), ప్రధాన కార్యదర్శిగా ఈమని గ్రీష్మ కుమార్, ట్రెజరర్ నిమ్మ శ్రీధర్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జమితార చంద్రశేఖర్, గుబ్బ శ్రీను, నల్లా శివకుమార్, రాంబాబు, బండి కృష్ణ, బత్తుల నాగేశ్వరరావు, రవి, శ్రీధర్‌రెడ్డి, వట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మహిళా సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లలిత

తణుకు అర్బన్: అఖిల భారత ఓబీసీ మహిళా సంఘం ఏపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తణుకుకు చెందిన మనుభర్తి లలిత నియమితులయ్యారు. ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. రాష్ట్రంలో బీసీ మహిళా సాధికారత కోసం కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ నెల 27న గుంటూరులో బీసీల రాష్ట స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.